ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ఎన్.టి.ఆర్
జిల్లా వార్తలు
మంగళవారం 8 అక్టోబరు 2024



నేటి అలంకారం
శ్రీమహాలక్ష్మీ దేవి





దుర్గమ్మ ఉత్సవ వేళ..
కృష్ణమ్మ కాంతుల హేల..

చల్లగా చూడమ్మా.. చండికా..

ఇంద్రకీలాద్రిపై సాఫీగా సాగిన క్యూలైన్లు

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన అధికారులు
- వీఐపీ అనధికార దర్శనాల కట్టడి
- ప్రతి ఒక్కరూ క్యూలోనే వెళ్లి దర్శనం
- శ్రీకాళహస్తి నుంచి అమ్మకు పట్టువస్త్రాలు

ఉదయమంతా భక్తజన వైభవం.. సాయంకాలమైతే సాంస్కృతిక వైభోగంతో ఇంద్రకీలాద్రి ముమ్మారు ముచ్చటపడి మురిసిపోతోంది. యువత సేవాస్ఫూర్తిని చూసి మైమరిచిపోతోంది. దానశీలుర దాతృత్వానికి ఆనందంతో కరిగి పోతోంది. భక్తుల జయజయధ్వానాలకు తన్మయత్వం చెందుతోంది. అందుకేనేమో ఉత్సవాలు మొదలయ్యాక తొలిసారి సోమవారం భక్తులపై వర్షాక్షితలు చల్లింది. ఆదివారం నాటి వీఐపీ అనధికార దర్శనాల వివాదాలతో అధికారులు అప్రమత్తం కావడం, సోమవారం ప్రతి ఒక్కరూ క్యూల్లోనే వెళ్లడంతో లైన్లన్నీ సాఫీగానే సాగాయి. మహాచండీగా దర్శనమిచ్చిన అమ్మను సులువుగా దర్శించుకున్న భక్తులు మహాదానందంతో ముందుకు కదిలారు.



ఘనంగా చండీహోమం



దివ్యాంగ భక్తుడి సేవలో వలంటీర్లు

విజయవాడ/చిట్టినగర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ సోమవారం మహాచండీగా దర్శనమిచ్చింది. రద్దీ సాధారణంగానే కనిపించింది. వినాయకుడి నుంచి ప్రారంభమైన ఉచిత, రూ.100, రూ.300 క్యూల్లోని భక్తులు నడుస్తూనే ఉన్నారు. రూ.500 దర్శనం ఖాళీగా కనిపించింది. ఆదివారం నాటి అనధికార దర్శనాలపై ఆంధ్రజ్యోతిలో 'భక్తుల ఫైర్' కథనం ప్రచురితం కాగా, స్పందించిన అధికారులు వీఐపీల రాకను కట్టడి చేశారు. వీఐపీల పేరుతో వచ్చిన భక్తులను డోనార్‌సెల్ వద్ద మెట్ల దగ్గర ఏర్పాటుచేసిన బారికేడ్ల పక్క నుంచి రూ.500 క్యూలో పంపారు. రాజగోపురం మార్గం ద్వారా జరిగే దర్శనాలకు చాలావరకు బ్రేక్‌లు వేశారు. కాగా, మహామండపంలోని ఆరో అంతస్తులో జరిగిన కుంకుమార్చనల్లో నందమూరి హరికృష్ణ కుమార్తె సుహాసిని, సినీనటుడు కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి పాల్గొన్నారు. సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా దంపతులు, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. శరన్నవరాత్రులు మొదలైన తర్వాత తొలిసారిగా ఎలాంటి వివాదాలు లేకుండా భక్తులు సాఫీగా క్యూల్లో వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. మల్లికార్జునపేటలో ఉన్న లడ్డూ తయారీ పోటును కలెక్టర్ సృజన పరిశీలించారు. తూకం ప్రకారం లడ్డూ ఉందా లేదా పరిశీలించారు. అమ్మవారికి శ్రీకాళహస్తి దేవస్థాన అధికారులు సోమవారం పట్టువస్త్రాలు సమర్పించారు. భవానీల రాక మొదలుకావడంతో ఇంద్రకీలాద్రి అరుణవర్ణాన్ని పులుముకుంది.

సాంస్కృతిక ప్రదర్శనలో కళాకారిణి నాట్య భంగిమ



ఇదేం.. గృహచారం

పీఎంఏవై ఇళ్ల లబ్ధిదారులకు గృహ నిర్మాణ శాఖ షాక్

లబ్ధిదారులకు బకాయిలు చెల్లించకుండా అనర్హత వేటు



కేంద్ర ప్రాయోజిత పథకానికి (పీఎంఏవై) అర్హత సాధించి.. ఇళ్లు కూడా నిర్మించుకుని.. మూడేళ్లుగా నివాసం ఉంటున్న లబ్ధిదారులను ఇప్పుడు అనర్హులుగా తేలుస్తూ గృహనిర్మాణ శాఖ అధికారులు తీసుకున్న నిర్ణయం వివాదాస్పదమవుతోంది. 300 యూనిట్ల విద్యుత్ వినియోగ బిల్లును సాకుగా చూపిస్తూ రెండు జిల్లాల్లో చాలామంది లబ్ధిదారులపై అనర్హత వేటు వేయడం విమర్శల పాలవుతున్నా.. తెరవెనుక కారణాలు మాత్రం సందేహాత్మకంగానే ఉన్నాయి.

- విద్యుత్ బిల్లులు 300 యూనిట్లు దాటాయని సాకు
- మూడేళ్లుగా నివాసమున్నాక ఇప్పుడేంటంటూ లబ్ధిదారుల ప్రశ్న
- బకాయిల నుంచి తప్పించుకోడానికేనని మండిపాటు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కేంద్ర ప్రాయోజిత పథకం (పీఎంఏవై)లో భాగంగా ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు గృహ నిర్మాణ శాఖ అధికారులు షాక్ ఇస్తున్నారు. రీ వెరిఫికేషన్ పేరిట చాలామందిని అనర్హత జాబితాలో చేరుస్తూ వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇలా.. ఉమ్మడి కృష్ణాజిల్లాలో వందలాది సంఖ్యలో పీఎంఈవై లబ్ధిదారులను అనర్హులుగా చేర్చారు. ఈ పథకం కింద అందిన సాయానికి తోడు అధిక భాగం అప్పుచేసి, ఇళ్లు కట్టుకుని మూడేళ్లుగా నివాసం ఉంటుండగా, ఇప్పుడు అనర్హత జాబితాలో చేర్చడమేమిటంటూ లబ్ధిదారులు తలలు పట్టుకుంటున్నారు.

విద్యుత్ బిల్లు 300 యూనిట్లు దాటకూడదట..!

గృహ నిర్మాణ శాఖ అధికారులు ఆరు అంశాల ప్రాతిపదికన పునః పరిశీలన జరిపారు. 300 యూనిట్ల విద్యుత్ వినియోగం దాటిందన్న కారణంతో చాలామందిపై అనర్హత వేటు వేశారు. ఇళ్లు కట్టుకుని, గృహ ప్రవేశాలు చేసి మూడేళ్లుగా నివాసం ఉంటుండగా, ఇప్పుడు అనర్హత వేటు వేయటం హాస్యాస్పదంగా ఉందని లబ్ధిదారులు చెబుతున్నారు. ప్రస్తుతం అనర్హత వేటు వేసిన పీఎంఏవై లబ్ధిదారులను మూడేళ్ల కిందటే ఎంపిక చేశారు. అప్పట్లో ఈ నిబంధనలు లేవు. కేంద్ర ప్రాయోజిత పథకం మేరకు సొంత ఇంటి స్థలం ఉండి, ఆధార్‌కార్డు కలిగి, దారిద్ర్య రేఖకు దిగువన ఉంటే చాలు.. అప్పట్లో కేంద్రం నిర్దేశించిన నిబంధనల ప్రకారం అర్హత సాధించినట్టే. ఇలాంటి వారికి కేంద్రం కొంత సాయమందించింది. మిగిలింది తాము సొంతంగా భరించి ఇళ్లు నిర్మించుకున్నారు. కిందటి ప్రభుత్వంలో పీఎంఏవై డబ్బు సకాలంలో లబ్ధిదారులకు చెందలేదు. ఇల్లు పూర్తి చేసుకున్న వారికి ఉపాధి హామీ పథకం ద్వారా అందించాల్సిన డబ్బు కూడా చెల్లించలేదు. ఇళ్లు పూర్తయినా చాలామందికి వివిధ దశల్లో నిధులు నిలిచిపోయాయి. కానీ, పీఎంఏవై పథకం కింద తలపెట్టిన ఇళ్లన్నీ దాదాపు పూర్తయిపోయాయి. తాజాగా ఇలాంటి ఇళ్లపై అనర్హత వేటు వేయటం వివాదాలకు తావిస్తోంది. కొత్తగా పీఎంఏవై 2.0 అమలు చేస్తున్న తరుణంలో గృహ నిర్మాణ సంస్థ అధికారులు ఈ నిబంధనలను పెట్టినా అర్థవంతంగా ఉండేది. ఇంతకుముందు పథకానికి సంబంధించి విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటుతోందన్న పేరుతో అనర్హత వేటు వేయటమే విమర్శలకు కారణమవుతోంది.

కారణం అదేనా..?

పీఎంఏవైలో చాలామంది లబ్ధిదారులకు ఇంకా బకాయిలు రావాల్సి ఉంది. ఆ డబ్బును ఇవ్వలేక ఇలా విద్యుత్ అంశాన్ని తెరపైకి తెస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. గృహ నిర్మాణ సంస్థ అధికారులు తీసుకున్న ఈ వివాదాస్పద నిర్ణయాలు ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ఉన్నాయి. ఎవరైనా తమ స్థలంలో ఇల్లు కట్టుకోవాలంటే తమ శక్తి సరిపోకపోతే ఎంతో కొంత సాయంగా ఉంటుందన్న ఉద్దేశంతో పీఎంఏవై పథకానికి దరఖాస్తు చేసుకుంటారు. కరెంటు బిల్లును చూసి ఈ పథకాన్ని మంజూరు చేసే విధానం గతంలో లేదు. అప్పుడు లేని విద్యుత్ బిల్లు అంశం.. ఇళ్లు కట్టుకుని మూడేళ్లుగా నివాసముంటున్న తర్వాత ఎందుకు తీసుకొచ్చారనేది ప్రశ్నార్థకంగా మారింది. అలాగే, లబ్ధిదారులెవరికైనా విద్యుత్ కనెక్షన్ లేకపోతే ఇంటి మంజూరు పత్రం ఆధారంగానే మోటార్ కోసం కనెక్షన్ ఇస్తారు. ఒకవేళ అప్పటికే విద్యుత్ కనెక్షన్ ఉంటే సమస్య ఉండదు. ఒకవేళ కనెక్షన్ తీసుకుంటే మాత్రం ఇంటిని నిర్మించుకున్నాక వారు కేటగిరీని మార్చుకోవాల్సి ఉంటుంది. ఇలా కేటగిరీలు ఇంకా మార్చుకోనివారు, వీటిపట్ల అవగాహన లేనివారు కూడా ఉన్నారు. ఇది లబ్ధిదారుల తప్పు ఎలా అవుతుందన్న సందేహాలు కలుగుతున్నాయి. కాగా, పీఎంఏవై పథకంలో భాగంగా ఇచ్చే రూ.2.30 లక్షలు ఇంటి నిర్మాణానికి సరిపోవు. మరో రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలను లబ్ధిదారులే సమకూర్చుకుంటారు. ఇప్పుడు అనర్హత పేరుతో ఇబ్బంది పెట్టడం వల్ల అదనపు భారం తమపై పడుతుందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉత్సవాలకు ప్రత్యేక అధికారి

దేవదాయ శాఖ అదనపు కమిషనర్ రామచంద్రమోహన్ నియామకం

ఆదివారం నాటి అనధికార దర్శనాల ఎఫెక్ట్

విజయవాడ/చిట్టినగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై అనధికార దర్శనాల వివాదాలపై దేవదాయ శాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. దర్శనాల 'లాజిక్‌లు' అర్థం కాకపోవడంతో ప్రత్యేకాధికారిని నియమించింది. శరన్నవరాత్రులకు ప్రత్యేక అధికారిగా దేవదాయ శాఖ అదనపు కమిషనర్ కె.రామచంద్రమోహన్‌ను నియమిస్తూ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలిచ్చారు. సోమవారంతో శరన్నవరాత్రుల్లో ఐదు రోజులు పూర్తయ్యాయి. మరో ఐదు రోజులు ఉత్సవాలకు అత్యంత కీలకం. మంగళవారం నుంచి భక్తుల రద్దీ పెరిగే అవకాశాలుండటం, బుధవారం మూలానక్షత్రం కావడంతో అనధికార దర్శనాల వల్ల కలిగే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు.

టీడీపీ సీనియర్ నేత గౌరంగబాబు మృతి



యలమంచిలి గౌరంగబాబు (ఫైల్)

పటమట, అక్టోబరు 7 : టీడీపీ సీనియర్ నాయకుడు, దుర్గగుడి మాజీ చైర్మన్ యలమంచిలి గౌరంగబాబు (80) సోమవారం ఉదయం మృతిచెందారు. భారతీనగర్ సమీపంలోని తన నివాసంలో ఆయన తుదిశ్వాస విడిచారు. గౌరంగబాబు.. టీడీపీ కంకిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జిగా, ఉమ్మడి కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, ఉమ్మడి కృష్ణాజిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. ఆయనకు భార్య, కుమార్తె, మనవడు, మనుమరాలు ఉన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా పార్టీ పటిష్ఠతకు పాటుపడ్డారని, ఆయన కుటుంబానికి భగవంతుడు శక్తిని ప్రసాదించాలని కోరుకున్నట్లు పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ తెలిపారు. గౌరంగబాబు భౌతికకాయాన్ని, టీడీపీ నాయకులు దేవినేని ఉమా, బొప్పన భవకుమార్, చెన్నుపాటి గాంధీ, జాస్తి సాంబశివరావు సందర్శించి నివాళులర్పించారు. శ్రీనగర్ కాలనీలోని స్వగృహం నుంచి మంగళవారం ఉదయం అంతిమయాత్ర బయల్దేరుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

దసరా ఉత్సవాలకు వచ్చి.. లాడ్జీలో సీఐల పేకాట

బయటకు వచ్చిన వీడియో

ఉన్నతాధికారుల విచారణ



6లో

1.71 లక్షల మంది బాధితులకు రూ.281 కోట్లు

- కలెక్టర్ సృజన వెల్లడి

6లో

దరఖాస్తుల కిక్కు..

- నేడు, రేపు మరిన్ని పెరిగే అవకాశం
- 11న లాటరీ ద్వారా షాపుల కేటాయింపు

రెండు జిల్లాల్లో 2,110 దరఖాస్తులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : మద్యం దుకాణాలకు డిమాండ్ పెరుగుతోంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎన్టీఆర్ జిల్లాకు ఎక్కువగా దరఖాస్తులు అందుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 236 మద్యం షాపులకు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో ఎన్టీఆర్ జిల్లాలో 113, కృష్ణాజిల్లాలో 123 షాపులున్నాయి. ఈ షాపులకు సంబంధించిన దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఈనెల 9వ తేదీ వరకు స్వీకరిస్తారు. సోమవారం నాటికి ఎన్టీఆర్ జిల్లాలోని 113 దుకాణాలకు 1,565 దరఖాస్తులు అందాయి. ఒక్క సోమవారమే 781 దరఖాస్తులొచ్చాయి. నగరంలో ఏర్పాటు చేయబోయే 39 షాపులకు 496 దరఖాస్తులు అందడం విశేషం. ఇక కృష్ణాజిల్లాలోని 123 షాపులకు వెరసి 545 దరఖాస్తులు అందాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు ఇంకా రెండు రోజుల గడువు ఉండటంతో మంగళ, బుధవారాల్లో మరిన్ని దాఖలవుతాయని అధికారులు భావిస్తున్నారు. 10వ తేదీన దరఖాస్తుల పరిశీలన పూర్తయ్యాక 11న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో లాటరీ ద్వారా షాపులు కేటాయిస్తారు.

దరఖాస్తుదారులకు బెదిరింపులు

ఉమ్మడి జిల్లాలో మద్యం షాపుల ఏర్పాటుకు సంబంధించిన దరఖాస్తుదారులను కూటమి ప్రజాప్రతినిధుల అనుచరులు బెదిరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తులు ఇవ్వడానికి అభ్యర్థులను రానివ్వడం లేదంటున్నారు. ఎవరెవరు దరఖాస్తులు చేశారో ప్రైవేట్ వ్యక్తులకు సమాచారం వెళ్లిపోతోందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అయితే, వీటిని ఎక్సైజ్ అధికారులు కొట్టిపారేస్తున్నారు. ఎన్ని దరఖాస్తులు దాఖలయ్యాయో అనే సమాచారం తెలుసుకునే అవకాశం ఈఎస్ (ఎక్సైజ్ సూపరింటెంట్)కు ఉందని, అంతకుమించి ఏ వివరాలు తెలిసే చాన్స్ లేదంటున్నారు. విజయవాడ కేంద్రంగా ఇప్పటికే లిక్కర్ సిండికేట్ సమావేశం నిర్వహించినట్టు తెలిసింది. ఎక్కడెక్కడ, ఏయే షాపులకు, ఎవరెవరు దరఖాస్తులు చేయాలో నిర్ణయించుకున్నట్టు సమాచారం. ఈ సిండికేట్‌లో అన్ని పార్టీలకు చెందినవారున్నారు.

మైనర్‌పై అత్యాచారయత్నం

అడ్డుకున్న ఆర్ఎస్ఐ

విజయవాడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : సోడాబండి వద్ద కూర్చున్న బాలికపై బ్లేడ్ బ్యాచ్ యువకుడి కన్నుపడింది. మాయమాటలు చెప్పి అఘాయిత్యం చేయడానికి రైల్వేట్రాక్‌వైపు తీసుకెళ్లే ప్రయత్నం చేశాడు. దీన్ని గమనించిన చుట్టుపక్కల వారు.. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న ఆర్ఎస్ఐకు విషయం చెప్పారు. ఆయన వెంటనే స్పందించి ఆ కామాంధుడి కాలర్ పట్టుకున్నారు. బాలికను క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటన ఆదివారం రాత్రి జరిగింది. వన్‌టౌన్‌లోని వినాయకుడి ఆలయం వద్ద ఉన్న కెనాల్ రోడ్డులో భార్యాభర్తలు సోడాబండి నడుపుకొంటున్నారు. వారికి పన్నెండేళ్ల మతిస్థిమితం లేని బాలిక ఉంది. ఆదివారం రాత్రి తల్లి, తండ్రి లేని సమయంలో ఎ.కొండూరుకు చెందిన సుబ్రహ్మణ్యం అనే బ్లేడ్‌బ్యాచ్‌కు చెందిన యువకుడు ఆమె వద్దకు వెళ్లి మాయమాటలు చెప్పాడు. నెమ్మదిగా నడిపించుకుని రాజీవ్‌గాంధీ పార్కు వద్ద ఉన్న రైల్వేట్రాక్ పైకి తీసుకెళ్లాడు. పార్కు వద్ద వ్యాపారం చేసుకుంటున్న కొంతమంది వ్యాపారులు బాలికతో సుబ్రహ్మణ్యం ట్రాక్‌పైకి వెళ్లడాన్ని గమనించారు. శరన్నవరాత్రుల్లో ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తున్న ఆర్ఎస్ఐ బేగ్‌కు ఈ విషయాన్ని చెప్పారు. ఆయన వెంటనే ట్రాక్‌పైకి వెళ్లి బాలికను కాపాడారు. అక్కడి నుంచి సుబ్రహ్మణ్యం పారిపోతుండగా, పట్టుకున్నారు. కృష్ణలంక పోలీసులకు సమాచారం ఇవ్వగా, కేసు నమోదు చేసి సుబ్రహ్మణ్యాన్ని అరెస్టు చేశారు.





మహామండపంలోని ఆరో అంతస్తులో జరిగిన కుంకుమార్చనల్లో పాల్గొన్న సినీనటుడు కృష్ణంరాజు సతీమణి శ్యామలదేవి, నందమూరి హరికృష్ణ కుమార్తె సుహాసిని



అంతరాలయంలో..



దుర్గమ్మకు పట్టువస్త్రాలు తీసుకువచ్చిన శ్రీకాళహస్తి ఈవో చంద్రశేఖర్ అజాద్, అధికారులు

అత్యంత మధురం

దుర్గమ్మ లడ్డూ ప్రసాదం



లడ్డూ రుచి పరిశీలిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

- అమ్మ ప్రసాదాన్ని ఘనంగా చెప్పుకుందాం
- శరన్నవరాత్రులకు 30 లక్షల లడ్డూలు
- మూలా నక్షత్రం నాడు 3 లక్షలు సిద్ధం
- రోజుకు 60-70 వేల విక్రయాలు
- అత్యంత నాణ్యతా ప్రమాణాలతో తయారీ
- నెయ్యి, ముడిసరుకుల నాణ్యత పరిశీలన
- ఎక్కువ రోజులు నిల్వ ఉండేలా చూడాలని సిబ్బందికి సూచన
- లడ్డూ తయారీ విధానాన్ని స్వయంగా వీక్షించిన కలెక్టర్ సృజన




(ఆంధ్రజ్యోతి - విజయవాడ/ చిట్టినగర్/వన్‌టౌన్)

మూలనక్షత్రం రోజున అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం 3లక్షల లడ్డూలను అందుబాటులో ఉంచాలని అధికారులు నిర్ణయించారు. ఈనెల తొమ్మిదో తేదీన కనకదుర్గమ్మ సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఆదేరోజున అమ్మవారి జన్మనక్షత్రం మూల రావడంతో భక్తులు ప్రతీఏడాది భారీగా దర్శనాలకు వస్తుంటారు. గడచిన ఏడాది మూల నక్షత్రం రోజున అమ్మవారిని లక్ష మంది భక్తులు దర్శించుకున్నారు.

మూలా నక్షత్రం నాడు భారీగా తరలివచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని అమ్మ ప్రసాదాన్ని భక్తులందరూ పొందటానికి వీలుగా ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం సర్వ సన్నద్ధమైంది. ఆ రోజున మూడు లక్షల లడ్డూలు సిద్ధం చేయాల్సిందిగా దుర్గగుడి యంత్రాంగానికి జిల్లా కలెక్టర్ సృజన నిర్దేశించారు.

ఈ ఏడాదీ అదేస్థాయిలో భక్తులు రావొచ్చని అంచనా వేస్తున్నారు. గడచిన ఏడాది శరన్నవరాత్రుల్లో 25లక్షల లడ్డూలను భక్తులు కొనుగోలు చేశారు. శరన్నవరాత్రులు పది రోజులు తర్వాత మరో మూడు రోజులపాటు భక్తులు ఇంద్రకీలాద్రికి భారీగా వస్తారు. భవానీ భక్తులు దక్షిణాది రాష్ట్రాల నుంచి అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. దీనితో దసరా ముగిసిన మూడు రోజులపాటు ఇంద్రకీలాద్రి కిటకిటలాడుతుంది. దసరా తర్వాత మూడు రోజుల్లో కలిపి గడచిన ఏడాది 25లక్షల లడ్డూలు విక్రయించారు. ఈ ఏడాది మొత్తం 30లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. ప్రస్తుతం రోజుకు లక్ష లడ్డూలను తయారు చేస్తున్నారు. ఇప్పటి వరకు రోజుకు 60-70లడ్డూలు విక్రయిస్తున్నారు.



నాణ్యతలో రాజీ పడేది లేదు

టీడీడీలో లడ్డూ కల్తీపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో, రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద దేవస్థానమైన కనకదుర్గమ్మ లడ్డూ ప్రసాదం విషయంలో అపోహలు తలెత్తకుండా ఉండటానికి అత్యంత నాణ్యవంతంగా లడ్డూలు తయారు చేయాల్సిందిగా కలెక్టర్ సృజన దేవస్థాన ఈవోను ఆదేశించారు. లడ్డూ ప్రసాదంలో రాజీ పడేది లేదని కలెక్టర్ సృజన తెలిపారు. కలెక్టర్ లడ్డూ ప్రసాద తయారీ కేంద్రం (లడ్డూ పోటు)ను సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. లడ్డూ ప్రసాదానికి వినియోగిస్తున్న పదార్థాలను స్వయంగా పరిశీలించారు. విజయ నెయ్యి నాణ్యతను పరిశీలించారు. ల్యాబ్‌ల నుంచి వచ్చిన ఫలితాలు నమోదు చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కనకదుర్గమ్మ లడ్డూ ప్రసాదం ఎక్కువ కాలం నిల్వ ఉండేలా అత్యంత నాణ్యత కలిగిన శనగపిండి, పంచదార, నూనె, నెయ్యి , జీడిపప్పు, కిస్మిస్, యాలకుల పొడి వాడుతున్నట్టుగా కలెక్టర్ పరిశీలనలో గుర్తించారు. లడ్డూ నాణ్యతను తెలుసుకునేందుకు రుచి, లడ్డూ బరువు తూకం వేయించి చూశారు.

మూలానక్షత్రం రోజున డిమాండ్‌కు అనుగుణంగా ప్రసాద తయారీ కేంద్రాలను కూడా పెంచుతామని చెప్పారు. ఇప్పటికే కనకదుర్గా నగర్, రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, భవానీ ఘాట్లలో కూడా ప్రసాద విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. లడ్డూ తయారీ కేంద్రాల నుంచి లడ్డూ విక్రయ కేంద్రాలకు రవాణా విషయంలో ఎదురౌతున్న సమస్యలను పరిష్కరించాల్సిందిగా పోలీసులకు ఆదేశించటం జరిగిందని చెప్పారు. రోజుకు పాతిక వేల మందికి పైగా అన్న ప్రసాద వితరణ కూడా చేస్తున్నామన్నారు. కట్టె పొంగలి, పులిహోర, దద్దోజ్యనం కూడా భక్తులకు అందిస్తున్నట్టు తెలిపారు.

ఆదాయం రూ. 82.13లక్షలు

వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దసరా మహోత్సవాలు ఆదివారం నాటికి నాలుగురోజులు ముగియగా.. భక్తులు సుమారు 75 వేలమంది దర్శించుకున్నారని అంచనా. తొలి నాలుగు రోజుల్లోనూ ఆదివారం నాడు ఆదాయం గణనీయంగా పెరిగింది. రూ.500లు టిక్కెట్ల ద్వారా రూ.34,73,500లు, రూ.300ల టిక్కెట్‌ద్వారా రూ.9,82,200లు, రూ.100లు టిక్కెట్ ద్వారా రూ.6,21,000లు ఆదాయం వచ్చింది. 30,887 లడ్డూలు విక్రయించగా, రూ.4,63,305లు లభించింది. ఆరు లడ్డూల ప్యాకింగ్‌ల ద్వారా రూ.23,95,000లు ఆదాయం సమకూరింది. పరోక్ష ప్రత్యేక కుంకుమార్చన రూ.3000లు ద్వారా రూ.75వేలు, ప్రత్యేక సేవా టిక్కెట్‌ల ద్వారా రూ.35,212లు, ఇతరత్రా ఆదాయాలు రూ.4,150లు, పబ్లికేషన్‌లు, ఫోటోలు, క్యాలెండర్ల ద్వారా రూ.4,445లు ఆదాయం సమకూరింది. తలనీలాల సమర్పణ రుసుము రూ.40 టిక్కెట్ ద్వారా రూ.1,27,000లు ఆదాయం సమకూరింది. మొత్తంగా కనకదుర్గమ్మవారికి రూ.82,13,412లు ఆదాయం సమకూరింది.

దుర్గమ్మకు కాళహస్తీశ్వరుని పట్టువస్త్రాల సమర్పణ

వన్‌టౌన్ : దసరా మహోత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మవారికి సోమవారం కాళహస్తీశ్వర స్వామి దేవస్థానం నుంచి సోమవారం పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈవో చంద్రశేఖర ఆజాద్, ఆలయ అధికారులు మేళతాళాలు, వేదమంత్రాల మధ్య పట్టు వస్త్రాలను తీసుకువచ్చారు. వారికి ఆలయంలో ఇస్తికపాల్ మర్యాదలను అందజేశారు. అనంతరం అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న అజాద్, తదితరులకు ఆశీస్సులను.. అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.



ఖాళీగా దర్శనమిస్తున్న క్యూ

వర్షంతో తగ్గిన రద్దీ

భవానీపురం : సోమవారం 3.30 తర్వాత నగరంలో ఓ మోస్తరు వర్షం కురవడంతో కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తుల తాకిడి కొంతమేర స్తంభించింది. క్యూలైన్లలో భక్తుల రద్దీ ఒక్కసారిగా తగ్గిపోయింది. వినాయకుడి గుడి, కుమ్మరిపాలెం వైపు క్యూలో భక్తులు స్వల్పంగా కనపించారు. ఈసారి సాయంత్రం 6 నుంచి 7 వరకు నగరోత్సవం, అమ్మవారికి పంచహారతులతో దర్శనాలకు బ్రేక్ ఇస్తుండటంతో భక్తులు నెమ్మదించారు. 4 నుంచి 6 మధ్య భక్తుల రాకపోకలు తగ్గాయి. రాత్రి 7 నుంచి తిరిగి దర్శనాలకు వచ్చేవారి సంఖ్య పెరిగింది. వాటర్ ప్రూఫ్ షెల్టర్లు లేక భక్తులు వర్షంతో కొంత ఇబ్బంది పడ్డారు.



కెనరా బ్యాంకు ఇచ్చిన బస్సు ఎక్కుతున్న భక్తులు

దివ్యరథాలతో అమ్మకు ఆదాయం

- వృద్ధులు, దివ్యాంగుల తరలింపునకు మూడు బస్సులు

భవానీపురం, అక్టోబరు 7: కెనరా, ఎస్‌బీఐ, కరూర్ వైశ్యాబ్యాంకులు కనకదుర్గమ్మకు విరాళంగా ఇచ్చిన మినీ బస్సులు (దివ్య రథాలు) అమ్మకు రూ.30లక్షలపైగానే ఆదాయం తెచ్చిపెట్టాయి. వీఎంసీ కార్యాలయం సమీపంలోని కేశఖండనశాల దగ్గరలో అటు బస్టాండ్, ఇటు కేశఖండన శాల నుంచి ఫ్లై ఓవర్ నుంచి వచ్చే భక్తులకు ఈ మూడు బ్యాంకులిచ్చిన బస్సుల ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారుల తల్లిదండ్రులు, రూ.500, రూ.5వేల ఉభయదాతల దర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసిన వారిని ట్రిప్పుకు 40 నుంచి 60 వరకు ఓం మలుపు వద్ద క్యూలైన్ వరకు దాదాపుగా 16 ట్రిప్పుల్లో తరలించారు. అయితే ఆలయానికి ఆదాయం ఎలా వస్తుందంటే.. ఈ మూడు బస్సులపై కేసీపీ, మహాసిమెంట్, సాగర్ సిమెంట్ కంపెనీతో పాటు ఎన్‌సీఎల్, ఎక్సీలా వంటి సంస్థలు ఉత్సవాల 10 రోజులకు రూ.10లక్షలను అమ్మ బ్యాంకు ఖాతాకు కట్టేశారు. బస్సుల చుట్టూ వారి కంపెనీల యాడ్స్ తగిలించారు.

క్యూలైన్ల వద్ద లుక్ వాకర్స్

చిట్టినగర్: సైబర్ నేరాలకు బాధితులుగా మారకుండా ఉండడానికి అవగాహన పెంపొందించడానికి పోలీసులు ఇంద్రకీలాద్రి పరిసర ప్రాంతాల్లో సోమవారం లుక్ వాకర్స్ నిర్వహించారు. 'సామాజిక మాధ్యమాల ద్వారా ఆన్‌లైన్ ట్రేడింగ్ వలలో పడి డబ్బులు పెట్టుబడిగా పెట్టకండి', 'నకిలీ కాల్ సెంటర్ల ద్వారా మిమ్మల్ని ఇంటర్వ్యూ చేసి ఉద్యోగాల పేరుతో డబ్బులు కాజేస్తారు' అని పొడవైన ఎల్‌ఈడీ లైట్లను కొంతమంది వ్యక్తులకు వెనుక వైపున అమర్చి క్యూలైన్ల వైపు తిప్పారు. నేరాలు జరిగినప్పుడు 1930కి ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని బోర్డులపై రాశారు. ఈ లుక్ ఫర్ వాకర్స్‌ను భక్తులతోపాటు రహదారులపై వెళ్తున్నవారు ఆసక్తిగా తిలకించారు.

శరన్నవరాత్రుల్లో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు అమ్మదరికి చేరని వారికి దర్శనాలు చేయిస్తున్నారు. తాజాగా 65 మంది దివ్యాంగ చిన్నారులను దర్శనాలకు తీసుకొచ్చారు. పోలీసులతో పనిచేస్తున్న సేవాదళ్ వివిధ ఆశ్రమాల్లోని దివ్యాంగులను దర్శనాలకు తీసుకొచ్చారు.

మద్యం సేవిస్తూ లాడ్జీలో సీఐల పేకాట

- దసరా ఉత్సవాలకు వచ్చి కార్డులు తిరగేశారు
- వీడియోపై ఉన్నతాధికారుల విచారణ

విజయవాడ/వన్‌టౌన్, అక్టోబరు 7: దుర్గగుడి దసరా ఉత్సవాల బందోబస్తుకు వచ్చిన సీఐలు మద్యం సేవించి పేకాట ఆడిన విషయం వెలుగుచూసింది. విజయవాడ కొత్తపేటలోని ఓ లాడ్జిలో వీరంతా పేకాట ఆడుతున్న వీడియోను ఆ రూమ్‌లో ఉన్న ఓ సీఐ బయటకు పంపించటంతో సోమవారం సోషల్ మీడియాలో హల్ చల్ చేసింది. దుర్గగుడిలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 2న రాత్రి సీఐలు రాయుడు, పలివెల శ్రీను, రఘు, కొత్తపేట సీఐ కొండలరావు కొత్తపేటలోని ఓ లాడ్జిలో రూమ్ తీసుకున్నారు. అందరూ కలిసి మద్యం సేవించి పేకాట ఆడారు. సీఐలు నలుగురు స్నేహితులే అయినప్పటికీ వీరిలో రాయుడు, రఘు మధ్య విభేదాలున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో రఘు తాను లేకుండా పేకాట ఆడుతున్న మిగిలిన అందరినీ వీడియో తీసి దానిని తనకు పరిచయం ఉన్న ఓ వ్యక్తికి పంపించాడు. ఆ వ్యక్తి సోషల్ మీడియాలో పెట్టటంతో హల్‌చల్ అయింది. పేకాటతో పాటు మద్యం సేవించిన బాటిళ్లు కూడా ఆ వీడియోలో స్పష్టంగా కనిపించాయి. సోషల్ మీడియాలో వీడియో రావటంతో పోలీసు ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు.

మేయర్‌కు ప్రొటోకాల్ 'భాగ్య'ం లేదా?

- రూ.300 టికెట్ క్యూలైన్లో నుంచి దర్శనం చేసుకున్న భాగ్యలక్ష్మి
- అధికారులు, పోలీసులు తీరుపట్ల ఆగ్రహం



రాజగోపురం వద్ద వేచిఉన్న మేయర్ భాగ్యలక్ష్మి

వన్‌టౌన్, అక్టోబరు 7: నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మికి దుర్గగుడిలో సోమవారం తీవ్ర భంగపాటు కలిగింది. నగర ప్రథమ పౌరురాలిగా ఉన్న ఆమెకు పోలీసులు, అధికారులు కనీస మర్యాదలు ఇవ్వలేదు. అమ్మవారి దర్శనానికి వచ్చిన ఆమెకు అడుగడుగునా భంగపాటు తప్పలేదు. రాజగోపురం దగ్గర వీవీఐపీలు వెళ్లేమార్గంలో ఆమెను వెళ్లనీయలేదు. రూ.300 టిక్కెట్ క్యూలైన్లో నుంచి ఆమె సాధారణ పౌరురాలిగా అమ్మవారి దర్శనం చేసుకోవాల్సి వచ్చింది. దీంతో పోలీసులు, దేవస్థానం అధికారుల తీరుపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బిళ్ల బంట్రోతు ఆమె వెంట ఉన్నా, డజన్ల కొద్దీ బంధువులు, మిత్రులను వెంటవేసుకు వచ్చే ఓ కానిస్టేబుల్‌కు ఇచ్చే గౌరవం కూడా పోలీసలు ఆమెకు ఇవ్వకపోవటం దారుణమన్న వ్యాఖ్యలు వినిపించాయి. కొండపైకి వరకు ఆమె వాహనాన్ని అడ్డుకున్నారు. తాను మేయర్‌నంటూ స్వీయ ఐడెంటిఫికేషన్ ఇచ్చుకోవాల్సి వచ్చింది. నగరానికి తాను ప్రథమ పౌరురాలినని, పోలీసులు, దేవస్థానం అధికారుల తీరు బాగాలేదన్నారు. తన వాహనానికి పాస్ ఇవ్వాలని కలెక్టర్‌ను, సీపీ, వీఎంసీ కమిషనర్‌ను అడిగినా మీరు మేయర్ గదా? మిమ్మల్ని ఎవరు నిలవరిస్తారంటూ ఉచిత సలహాలు ఇచ్చారన్నారు. తీరా ఇక్కడకు వస్తే పోలీసులు అడ్డంకులు కల్పించారన్నారు. కనీసం ప్రొటోకాల్ ఇవ్వాలని, గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదన్నారు.

నేటి నుంచి అసలైన పోరు

- ముగిసిన ఆలిండియా బ్యాడ్మింటన్ క్వాలిఫైంగ్ రౌండ్లు

విజయవాడ స్పోర్ట్సు: యోనెక్స్ సన్‌రైజ్ ఆలిండియా సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ (కలగర నాగబాబు మెమోరియల్) అండర్-15, 17 టోర్నీలో అసలు సిసలైన పోరుకు అంతర్జాయ షట్లర్లు సన్నద్ధమయ్యారు. 8 నుంచి 11 వరకు చెన్నుపాటి రామకోటయ్య ఇ టండోర్ స్టేడియం, సందీప్ బ్యా డ్మింటన్ అకాడమీల్లో 12 కోర్టుల్లో పోరుకు ఏర్పాట్లు పోరుకు సన్నద్ధమయ్యారు. పోటీలను మంగళవారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రారంభిస్తారు. సోమవారంతో క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లు పూర్తికాగా అండర్-15,17 విభాగాల్లో క్రీడాకారులు మెయిన్ డ్రా మ్యాచ్‌లకు అర్హత సాధించారు.



వరద బాధిత అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు నిత్యావసరాల కిట్ల పంపిణీ

ఆర్టీసీని బలోపేతం చేస్తాం

- వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మునిరత్నం

బస్‌స్టేషన్, అక్టోబరు 7: ఆర్టీసీని బలోపేతం చేసి లాభాల బాటలో నడిపించేందుకు కృషి చేస్తామని వైస్ చైర్మన్‌గా సోమవారం ఆర్టీసీ హౌస్‌లో బాధ్యతలు స్వీకరించిన పీఎస్ మునిరత్నం అన్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం చైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలిసి విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు తనకు ముఖ్యమైన ఆర్టీసీ వైస్ చైర్మన్ పదవి అప్పగించారని చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో అందరం కలిసి ఆర్టీసీని బలోపేతం చేసి లాభాల బాటలో నడిపించేందుకు కృషి చేస్తామన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ 50వేల మంది కార్మికులు ఆర్టీసీలో పనిచేస్తున్నారని, ప్రజలకు సేవలందిస్తున్న వారందరికీ అభినందనలు తెలిపారు. ఇటీవల వరదల్లో ఇబ్బందులకు గురైన 130 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు రూ.1500ల విలువైన నిత్యావసర వస్తువుల సరుకుల కిట్లను యూనియన్ తరుపున అందించారు. వాటిని కొనకళ్ల నారాయణరావు, మునిరత్నం బాధితులకు అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు తంగుడు ముత్యాలరావు, ప్రధాన కార్యదర్శి కుమార్ నాయక్ అందించిన విజ్ఞాపన పత్రంపై నారాయణ రావు స్పందిస్తూ ఉన్నతాధికారులతో సంప్రదించి చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్టీసీ ఈడీ (అడ్మిన్) బ్రహ్మానంద రెడ్డి, ఈడీ (ఈ) రవివర్మ, ఈడీ (ఓ) చంద్రశేఖర్, ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య, ఎం.డి. ప్రసాద్, కె.నాగేశ్వరరావు, ఎం.డి.ఎ సిద్ధిఖ్, మందపాటి శంకరరావు, నందమూరి రామారావు, నారాయణ, మోయిద్దీన్, వై.శ్రీనివాసరావు, బలరాంతో పాటు అన్ని డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు. అలాగే ఆర్టీసీ కార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి. శేషగిరిరావు, కోశాధికారి కె.సురేంద్ర, చిత్తూరు జిల్లా కార్యదర్శి హరిప్రసాద్, ప్రభాకర్, శంకర్ పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీల పట్టివేత!




పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

నందిగామ, అక్టోబరు 7 : మునేటి నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను నందిగామ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు అందించిన సమాచారం మేరకు.. పెనుగంచిప్రోలు మండలం శనగపాడు రీచ్ వద్ద నుంచి అక్రమంగా ఇసుకను హైదరాబాద్ తరలిస్తుండగా స్థానికులు అందించిన సమాచారం మేరకు సోమవారం నందిగామ పోలీసులు అనాసాగరం ఫ్లైఓవర్ వద్ద కాపు కాసారు. మూడు లారీలు, ఒక ట్రాక్టర్‌లో ఇసుక అక్రమ రవాణా అవుతుండటంతో ఆకస్మికంగా దాడిచేసి పట్టుకున్నారు. ఇసుక వాహనాలతో పాటు వాటికి ఎస్కార్ట్‌గా వస్తున్న రెండుకార్లను స్వాధీనం చేసుకున్నారు. వాల్టా చట్టంతో పాటు దొంగతనం కేసు నమోదు చేసినట్టు సీఐ ఎన్‌వీఎల్ నాయుడు తెలిపారు.

పోలీసులపై తీవ్ర ఒత్తిడి.. ఎట్టకేలకు కేసులు నమోదు

ఇసుక లారీలు పట్టుబడిన వెంటనే అప్రమత్తమైన అక్రమార్కులు వాటిని విడిపించుకొనేందుకు పెద్దఎత్తున హడావుడి చేశారు. ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నేతలతో పాటు పోలీసు అధికారులు, న్యాయవాదులు తదితరులతో ఫోన్లు చేయిస్తూ తీవ్ర ఒత్తిడి చేశారు. సాయంత్రం వరకూ ఎఫ్‌ఐఆర్ నమోదు కాకుండా ఆపగలిగారు. అయితే పోలీసులు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా కేసు నమోదు చేశారు. దీనికితోడు ఈ విషయం సామాజిక మాధ్యమాలలో వైరల్ కావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

పోలీసుల తీరుపై స్థానికుల పెదవి విరుపు!


పట్టణం నుంచి నిత్యం ఇసుక హైదరాబాద్ తరలివెళుతుంటే పట్టించుకోని నందిగామ పోలీసులు పెనుగంచిప్రోలు మండలం నుంచి తరలివెళుతున్న ఇసుకను అనాసాగరం వద్ద పట్టుకోవడంపై స్థానిక ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఏసీపీ కార్యాలయానికి కూతవేటు దూరంలో కుమ్మరివాగు నుంచి నిత్యం పదులసంఖ్యలో ట్రాక్టర్లు ఇసుకను ఒడ్డుకు చేర్చి లారీలకు ఎక్కించి హైదరాబాద్ తరలిస్తున్నారు. మండలంలోని మాగల్లు, రాఘవాపురం గ్రామాలలోని మునేటిలో నేరుగా ఎస్కవేటర్లతో ఇసుకను అక్రమంగా లోడ్ చేస్తూ మధిర, ఖమ్మం, హైదరాబాద్ తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. బహిరంగంగా జరుగుతున్న ఇసుక దోపిడీపై కన్నెత్తి చూడని నందిగామ పోలీసులు జగ్గయ్యపేట నియోజకవర్గంలోని శనగపాడు రీచ్‌పై ఎందుకు శ్రద్ధ పెట్టారన్నది ప్రశ్నగా మారింది. రాజకీయ ఒత్తిళ్ల వల్ల అక్కడి పోలీసులు పట్టుకోలేక పోవడం వల్ల ఉన్నతాధికారులు ఆ టాస్క్‌ను నందిగామ పోలీసులకు అప్పగించారా అన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. నందిగామలో జరిగే ఇసుక దోపిడీని అరికట్టేందుకు ఇతరప్రాంతాల పోలీసులకు టాస్క్ ఇస్తారేమో అంటూ సెటైర్లు వేస్తున్నారు.

1.71 లక్షల మంది బాధితులకు రూ. 281 కోట్లు

- 13 వేల పెండింగ్ కేసులకూ రూ. 15 కోట్లు పరిహారం జమ
- అర్హులైన వారు ఆందోళన వద్దు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): వరద ప్రభావిత ప్రాంతాలకు సంబంధించి మంగళవారం నాటికి 1.71 లక్షలమంది బాధితులకు రూ.281కోట్ల సాయాన్ని వారి బ్యాంకు ఖాతాలకు జమచేయటం జరిగిందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన చెప్పారు. సోమవారం ఈ మేరకు మీడియాకు కలెక్టర్ బులెటిన్‌ను విడుదల చేశారు. బ్యాంకు ఖాతాలు ఆధార్‌కు లింకు కాకపోవటం వంటి పలు సాంకేతిక సమస్యల కారణంగా పెండింగ్‌లో ఉన్న 13 వేల కుటుంబాలకు కూడా సోమవారం రూ. 15 కోట్ల పరిహారాన్ని జమ చేయటం జరిగిందని చెప్పారు. బ్యాంకు ఖాతాల కారణాల వల్ల పరిహారం అందచేయటంలో ఇబ్బందులు ఎదురైనట్టు గుర్తించి వాటిని 179 సచివాలయ కార్యదర్శులకు తెలియచేసి ఆయా కుటుంబాలను సంప్రదించేలా చేశామని, తద్వారా విచారణ జరిపి వాటిని సరిచేయటం జరిగిందని తెలిపారు. పరిహారం కోసం కలెక్టరేట్‌కు వచ్చి సమర్పిస్తున్న అర్జీలను కూడా క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతోందని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఆర్థిక సహాయం అందచేయటం జరుగుతుందని తెలిపారు. అర్హత ఉన్నవారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా కలెక్టర్ చెప్పారు.



ఎన్నికల అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే వసంత

కొండపల్లి మున్సిపల్ ఎన్నిక పూర్తిచేయండి

- ఎన్నికల అధికారికి వసంత వినతి

ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు త్వరలో ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నిని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సోమవారం విజయవాడలో కలిసి విజ్ఞప్తి చేశారు. చైర్మన్, వైస్ చైర్మన్‌లు లేకపోవడం వల్ల మున్సిపాలిటీలో ప్రజలకు మెరుగైన సేవలు అందడంలేదని ఆయన వివరించారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆమె సాధ్యమైనంత త్వరగా ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

తైక్వాండో పోటీల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ



మాచవరం : రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన తైక్వాండో పోటీల్లో శ్రీ చైతన్య కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. సోమవారం కళాశాల డీన్ హరిబాబు, ఉపాధ్యాయులు పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి ఉప్పు శ్యామ్ కుమార్ అండర్ 19లో రజత పతకం సాధించినట్లు తెలియజేశారు.



పార్వతీదేవి అలంకారంలో విజయదుర్గ అమ్మవారు



మహాచండీదేవి అలంకారంలో మంగళగౌరి అమ్మవారు



లలితాత్రిపురసుందరీదేవి అలంకారంలో మహాలక్ష్మి అమ్మవారు



చల్లపల్లి బంగ్లా సమీపంలోని కాశీ విశ్వేశ్వర దేవస్థానంలో..



లలితా త్రిపురసుందరీదేవిగా కాళీమాత

అమ్మకు భక్తనీరాజనం

లలితాత్రిపురసుందరీదేవి, పార్వతీ, మహాచండీ అలంకారాల్లో అమ్మవారు దర్శనం

చిట్టినగర్, అక్టోబరు 7: చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మీ అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ అధ్యక్షుడు లింగిపిల్లి అప్పారావు, కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, పలువురు కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.పాలఫ్యాక్టరీ చనమోలు వెంకట్రావ్ ఫ్లైఓవర్ బ్రిడ్జి పక్కనే ఉన్న విజయదుర్గా రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో విజయదుర్గా అమ్మవారు పార్వతీదేవి అలంకారంలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరిం విశేష పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమార్చనలు చేశారు. కొత్తపేటలో ఉన్న శ్రీ గంగానమ్మ అమ్మవారి దేవస్థానంలోని మంగళగౌరి అమ్మవారు మహాచండీదేవి అలంకారంలో భక్తులు దర్శించుకున్నారు. మహిళలు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కేఎల్ రావునగర్‌లో ఉన్న శ్రీ జంబులాంబదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీఎంసీ కాలనీలో ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారు మహాచండీదేవి అలంకారంతో భక్తులు దర్శించుకున్నారు. మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. భక్తులకు ఆలయ నిర్వహకులు దాస్ తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

లలితాత్రిపురసుందరీదేవిగా...

గవర్నర్‌పేట: చల్లపల్లి బంగ్లా సమీపంలోని కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో సోమవారం అమ్మవారు లలితాత్రిపురసుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో యడ్లపల్లి సీతారామయ్య, వంశపారంపర్య ధర్మకర్తల పర్యవేక్షణలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

లలితాత్రిపురసుందరీదేవిగా కాళీమాత

కృష్ణలంక: త్రిశక్తిపీఠంలోని కాళీమాత అమ్మవారు దసరా శరన్నవరాత్రుల ఐదవ రోజైన సోమవారం భక్తులకు లలితాత్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చింది. ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకం పూజలు నిర్వహించారు. విశేష హారతుల అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జి.పుల్లయ్య, కొప్పురావూరి జగదీష్ కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్, సూపరింటెండెంట్ ఎ.మధుసూదనరావు పాల్గొన్నారు.

మహాలక్ష్మిగా పోలేరమ్మ



కరెన్సీ నోట్లతో ముస్తాబైన ఊర్మిళానగర్ పోలేరమ్మ

భవానీపురం: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా ఊర్మిళానగర్‌లోని పోలేరమ్మ మహాలక్ష్మి అవతారంలో సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. అందరిపైన మహాలక్ష్మి కటాక్షం చూపాలని కోరుతూ కొత్త నోట్లతో అమ్మవారిని సుందరంగా ఆలయ కమిటీ చైర్మన్ సూరసాని రామిరెడ్డి అలంకరించారు. మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాల వినియోగం జరిగింది. హెచ్‌బీ కాలనీ సంకల్ప సిద్ధి షిర్డీ సాయిబాబా ఆలయంలో అమ్మవారు ఐదో రోజు చండీమాతగా దర్శనమిచ్చారు. ముత్తైదవులు కుంకుమ పూజలను నిర్వహించారు.

శ్రీ మహాచండీగా శివకాళేశ్వరి అమ్మవారు

పాత రాజరాజేశ్వరిపేట: 34వ డివిజన్ కేదారేశ్వరపేటలోని శ్రీ శివకాళేశ్వరి అమ్మవారు సోమవారం శ్రీ మహాచండీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులందరికి ఆలయ నిర్వాహకుడు కట్టా బాబ్జి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటి సభ్యులు వివి. రమణారావు, చింతల లక్ష్మయ్య, వై. రత్న, ఆర్. రాజు, వీకె. పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

మహాచండీగా ధనకొండ అమ్మవారు

మొగల్రాజపురం: దసరా మహోత్సవాలలో ఐదో రోజు మొగల్రాజపురం ధనకొండ మీద శ్రీశ్రీశ్రీ దుర్గా భవానీ అమ్మవారిని మహాచండీ దేవిగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ●మధురానగర్ మెయిన్ రోడ్డులో రత్నా గార్డెన్స్‌లో జరుగుతున్న దసరా వేడుకల్లో అమ్మవారిని మహాచండీ దేవిగా అలంకరించారు. భక్తులకు ప్రసాద పంపిణీ చేశారు. సాయంత్రం ప్రత్యేక పూజలు జరిగాయి.







మహాచండీగా శివకాళేశ్వరి అమ్మవారు, మహాచండీగా ధనకొండ అమ్మవారు, రత్నా గార్డెన్స్‌లో అమ్మవారు

మోదీ ప్రభుత్వం

ఇజ్రాయెల్‌కు కొమ్ముకాయడం దారుణం

● పాలస్తీనా సంఘీభావ సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు

గవర్నర్‌పేట, అక్టోబరు 7: దీర్ఘకాలంగా భారత్ అనుసరిస్తున్న విదేశాంగ విధానానికి విరుద్ధంగా నరేంద్రమోదీ ప్రభుత్వం ఇజ్రాయెల్‌కు కొమ్ముకాయడం దారుణమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. పాలస్తీనీయుల నివాస ప్రాంతం గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలని కోరుతూ సోమవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో సోమవారం పాలస్తీనా సంఘీభావ సభ జరిగింది. సభకు సీపీఎం జిల్లా నేత దోనేపూడి కాశీనాథ్ అధ్యక్షత వహించారు. సభలో 10 వామపక్ష పార్టీల నేతలు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ గాజా, ఇజ్రాయెల్ యుద్ధం విషయంలో భారత్ న్యూట్రల్‌గా ఉందని మోదీ ప్రభుత్వం చెప్పడం బూటకమన్నారు. న్యూట్రల్‌గా ఉన్నామంటూనే ఇజ్రాయెల్‌కు అండగా డ్రోన్లు ఎందుకు పంపుతోందని ప్రశ్నించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. రవీంద్రనాథ్ మాట్లాడుతూ వివిధ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలను ఆపడంలో ఐక్యరాజ్య సమితి విఫలమైందన్నారు. సీపీఐఎంఎల్ రాష్ట్ర నేత జాస్తి కిషోర్‌బాబు మాట్లాడుతూ టెర్రరిజం సాకుతో పశ్చిమ దేశాలు అరబ్ దేశాలపై దాడులు చేస్తున్నాయన్నారు. సీపీఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి పి. ప్రసాద్ మాట్లాడుతూ గాజాలో 3 లక్షల మంది సైనికులను ఇజ్రాయెల్ మోహరించిందని, కానీ సాధించింది శూన్యమన్నారు.

ఆయుర్వేదంతోనే ఆరోగ్యం

● ఆయుష్ మంత్రిత్వ శాఖ కమిషనర్ ఎస్‌బీ రాజేంద్రకుమార్ లఖింశెట్టి



మాట్లాడుతున్న కమిషనర్ రాజేంద్రకుమార్

పాయకాపురం, అక్టోబరు 7: ఆయుర్వేదంతోనే ప్రతి ఒక్కరికీ ఆరోగ్యమని ఆయుష్ మంత్రిత్వ శాఖ కమిషనర్ ఎస్‌బీ రాజేంద్రకుమార్ లఖింశెట్టి అన్నారు. 63వ డివిజన్ రాజీవ్‌నగర్‌లోని ప్రాంతీయ ఆయుర్వేద చర్మరోగ పరిశోధన సంస్థలో భారత ప్రభుత్వం 100 రోజుల్లో సాధించిన విజయాలపై ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఆయుష్ మంత్రిత్వ శాఖలో యోగా, నేచురోపతి, యునాని, సిద్ధ, హోమియోపతి, సోవా, రిగ్పా చికిత్సా విధానాలను వివరించారు. ప్రాచీన వైద్య విధానాలపై అపారమైన జ్ఞానాన్ని పునరుజ్జీవింపజేయడమే ఆయుష్ మంత్రిత్వ శాఖ లక్ష్యమన్నారు. అలాగే జాతీయ స్థాయిలో ఆయుష్ మంత్రిత్వ శాఖ సాధించిన ప్రగతి, విజయాలను వివరించారు. ప్రాంతీయ ఆయుర్వేద చర్మరోగ పరిశోధనా సంస్థ ఇన్‌చార్జ్ డీన్ బి.వెంకటేశ్వర్లు, ఆయుర్వేదిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి సుధాకర్, కళాశాల సిబ్బంది, ఆయుష్ మంత్రిత్వ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

అజిత్‌సింగ్‌నగర్, అక్టోబరు 7: మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం తోటవారి వీధికి చెందిన గుంటా లక్ష్మణరావు(36) సితారా సెంటర్‌లోని ఓ చికెన్ షాపులో పని చేస్తున్నాడు. గత కొంత కాలంగా మద్యానికి బానిసైన లక్ష్మణరావు పది రోజులుగా పనికి వెళ్లకుండా మద్యం సేవిస్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రిస్తుండగా పక్క గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అయితే మృతుడు మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడ్డాడా లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో బాలుడు..

ఎక్సెల్ ప్లాంట్ ప్రాంతంలో కుటుంబ సభ్యులతో ఉంటున్న తోట ధనూష్‌కుమార్(17) టెన్త్ ఫెయిలై ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈ నెల 5వ తేదీ రాత్రి ధనుష్ చదువు విషయమై తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన ధనుష్ ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరతో ఫ్యానుకు ఉరేసుకుని మృతి చెందాడు సమాచారం అందుకున్న అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాంబేకాలనీలో వృద్ధుడు ...

పాయకాపురం: వాంబేకాలనీకి చెందిన వృద్ధుడు షేక్ వలి బాషా(60) ఆదివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై నున్న రూరల్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం షేక్ వలి బాషాగత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆదివారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టు ప్రక్కల వారు నున్న రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బాధిత కుటుంబాలకు సరుకుల కిట్లు అందజేస్తున్న దళిత స్త్రీ శక్తి కన్వీనర్ గడ్డం ఝాన్సీ

బాధిత కుటుంబాలకు సరుకుల కిట్లు పంపిణీ

గవర్నర్‌పేట, అక్టోబరు 7: దళిత స్త్రీ శక్తి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం లెనిన్ సెంటర్‌లోని ఐక్య భవన్ ఆడిటోరియం వద్ద వరద ప్రాంతాల్లోని దళిత కుటుంబాలకు 10 సరుకులతో కలిపిన కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దళిత స్త్రీ శక్తి సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్ గడ్డం ఝాన్సీ మాట్లాడుతూ 15 మురికివాడలు, 5 గ్రామాల్లో కిట్‌లు పంపిణీ చేసినట్లు తెలిపారు. వరద ముంపు ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సహాయ కార్యక్రమాల పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, చిరంజీవ చిట్‌ఫండ్స్ అధినేత టి. ఆదిరామ్, వివిధ సంఘాల నేతలు కొండలరావు, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసం పాటుపడిన శంకరన్ చిరస్మరణీయుడు

● మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్



శంకరన్ కాంస్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నేతలు

గవర్నర్‌పేట, అక్టోబరు 7: పేదల అభ్యున్నతికై అనేక సంక్షేమ పథకాలు రూపకల్పన చేసి ప్రభుత్వాధినేతలను ఒప్పించి వాటి అమలు కొరకు నిర్విరామంగా కృషి చేసిన చిరస్మరణీయులు ఎస్ఆర్ శంకరన్ అని మాజీ శాసనమండలి సభ్యుడు, శంకరన్ మెమోరియల్ కమిటీ కన్వీనర్ జల్లి విల్సన్ అన్నారు. శంకరన్ 14వ వర్ధంతి సందర్భంగా లెనిన్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ ఐక్యతా భవన్‌లో శంకరన్ కాంస్య విగ్రహం వద్ద శ్రద్ధాంజలి కార్యక్రమం జరిగింది. కో-కన్వీనర్ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బుట్టి రాయప్ప అధ్యక్షత వహించారు. శంకరన్ విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ ఐఏఎస్ అధికారిగా పలు పదవులు బాధ్యతలు నిర్వహించిన శంకరన్ నిరాడంబరంగా జీవించారని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సంక్షేమం అనే పదానికి అర్థం వచ్చేలా పనిచేసిన ఘనత ఆ మహనీయునికే దక్కిందని కొనియాడారు. కమిటీ కో-కన్వీనర్ ఆంధ్ర మాల్యాద్రి, ఎస్సీ, ఎస్టీ రైల్వే ఫెడరేషన్ నాయకుడు కొండలరావు శంకరన్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు డాక్టర్ అంకయ్య, సంగుల పేరయ్య, నటరాజ్, గడ్డం ఝాన్సీ, పి. రాము, రాహెల్‌బాబు, పి. రాజు, కుమార్, గుప్తా పాల్గొన్నారు.



రన్నరప్ ట్రోఫీతో ఎన్టీఆర్ జిల్లా టీమ్

రాష్ట్రస్థాయి ఆత్యా-పాత్యాలో జిల్లా సత్తా

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 7: నెల్లూరు జిల్లా నవాబ్‌పేటలోని బీవీఎస్ మున్సిపల్ బాలికోన్నత పాఠశాల గ్రౌండ్స్‌లో ఈ నెల 5,6న జరిగిన రాష్ట్రస్థాయి ఆత్యా-పాత్యా సబ్ జూనియర్ అండర్-14 బాలుర భాగంలో జిల్లాకు ప్రాతినిధ్యం వహించిన క్రీస్తురాజుపురం క్రైస్ట్ ది కింగ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానంతో సత్తా చాటారు. ఈ సందర్భంగా విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ ఎం ప్రకాష్, ప్రిన్సిపాల్ సిస్టర్ మేరీ లౌలీ, పీఈటీ కిరణ్ అభినందించారు. రాష్ట్ర ఆత్యా-పాత్యా సీఈవో రంభా ప్రసాద్, ఏపీ సెక్రటరీ చరణ్‌కు స్కూల్ యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించండి

డీఎంహెచ్‌వో సుహాసినికి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమల వినతి



డీఎంహెచ్‌వో సుహాసినికి వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమల

వన్‌టౌన్, అక్టోబరు 7: ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ సంస్థ ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల కోరారు. సోమవారం ప్రభుత్వ పాత ఆసుపత్రి వద్ద నిర్వహించిన జాయింట్ మీటింగ్‌లో కమల డీఎంహెచ్‌వో సుహాసినికి వినతి పత్రం అందజేశారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన చర్చలలో పలు డిమాండ్లను లేవనెత్తారు. ఈ సందర్భంగా చర్చలు సఫలం అయ్యాయని పేర్కొన్నారు. డీఎంహెచ్‌వో ఆఫీసులో జరిగిన జాయింట్ మీటింగ్‌లో డీపీహెచ్‌ఎన్‌వో వియత్ లిధియా, డీఐవో అమృత, డీఈఎం ఎన్.హరీష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమల మాట్లాడుతూ గతంలో జరిగిన జాయింట్ మీటింగ్‌లో కూడా ప్రస్తుతం ఇచ్చిన సమస్యలనే పరిష్కరించాలని కోరామని, అమలు చేయాలని ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ అమలు కాలేదని, సీరియస్‌గా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా ఆశాలతో క్లీనింగ్ పనులు చేయించరాదన్న డిమాండ్‌తో పాటు మొత్తం 15 డిమాండ్లను ప్రస్తావించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై డీఎంహెచ్‌వో సానుకూలంగా స్పందించారు. ఆశా వర్కర్లకు వితంతు పెన్షన్ అమలు చేయాలని, 60 ఏళ్లు నిండిన ఆశాలకు జీవో వచ్చేంత వరకు పదవీ విరమణ చేయించరాదని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీచేయాలని, వితంతు పెన్షన్‌లను పునరుద్ధరించాలని కోరారు. దసరా డ్యూటీలు నిర్వహిస్తున్న ఆశా వర్కర్లకు టీఏ, డీఏలు ఇవ్వాలని కోరారు. ప్రత్తిపాటి జ్యోతి, పి. లక్ష్మి, జి.దయామణి, ఎం.వెంకటరమణ, పి.సునీత, సుజాత, నాగమణి, తిరుమలేశ్వరి, వనజ, నాగేశ్వరి, జానకి, రత్నకుమరి, హవేలి కుమారి, బీమా లక్ష్మి, ఎస్.పద్మ, తదితరులు పాల్గొన్నారు.






వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో, పాత శివాలయంలో

ధనలక్ష్మీదేవిగా పద్మావతి అమ్మవారు

వన్‌టౌన్, అక్టోబరు 7: బ్రాహ్మణవీధి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అయిదోరోజు సోమవారం పద్మావతి అమ్మవారు ధనలక్ష్మీదేవి అలంకారంలో దర్శనం ఇచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ● వన్‌టౌన్ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయం (పాత శివాలయం)లో అమ్మవారిని అయిదోరోజు సోమవారం లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. **కేబీఎన్ కాలేజీలో :** కేబీఎన్ కాలేజీలో మహాచండీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనం ఇచ్చారు. కాలేజీ యాజమాన్యం దసరా మహోత్సవాల సందర్భంగా కాలేజీ ప్రాంగణంలో ఉన్న దాసాంజనేయస్వామి వారి ఆలయంలో దసరా మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. అమ్మవారిని వివిధ అలంకారాల్లో కొలుస్తున్నారు.

ఎన్టీఆర్ గ్రామీణం

● జగ్గయ్యపేట ● నందిగామ ● తిరువూరు ● మైలవరం

బ్రాయిలర్ ధరలు


అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128,137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.535

కొండపల్లి మున్సిపల్ కమిషనర్‌గా పి.శ్రీనివాసరావు


బాధ్యతలు స్వీకరిస్తున్న పి.శ్రీనివాసరావు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 7: కొండపల్లి మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా పి.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు తాత్కాలిక విధులు నిర్వహించిన రమ్యకీర్తన బదిలీపై విజయవాడ వీఎంసీకి వెళ్లిపోయారు. ఒంగోలు నుంచి గుంటూరు బదిలీ అయ్యారు. అదనపు బాధ్యతగా ఆయన ఇక్కడ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించనున్నారు.


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వసంత

కౌన్సిలర్ మృతి బాధాకరం : ఎమ్మెల్యే

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 7: కొండపల్లి మున్సిపల్ కౌన్సిలర్ కుమ్మరి నాగసుధ (33) అకాల మరణం చాలా బాధాకరమని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. సోమవారం నాగసుధ అంత్యక్రియల్లో ఆయన పాల్గొని నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎంతో రాజకీయ భవిష్యత్తు ఉన్న నాగసుధ చిన్న వయస్సులో విష జ్వరంతో మృతి చెందడం ఎంతో విచారకరమన్నారు. నాగసుధ భర్త శ్రీనును ఓదార్చారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

వేదాద్రిలో వేలంపాట

జగ్గయ్యపేట రూరల్:వేదాద్రి గ్రామంలోని యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం వద్ద ఆలయ అధికారులు సోమవారం వేలంపాట నిర్వహించారు. కొబ్బరిచిప్పలు పోగు చేసుకునేందుకు, తులసీ మాల, పూలు అమ్ముకునే హక్కుకు వేలంలో రూ. 6.22 లక్షల ఆదాయం వచ్చిందని ఈవో సురేష్‌బాబు తెలిపారు.

వార్డు సభ్యులకు శిక్షణ

జగ్గయ్యపేట రూరల్: చిల్లకల్లులోని ఎంపీడీవో కార్యాలయంలో రెండ్రోజుల పాటు నిర్వహిస్తున్న ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యుల శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభించారు. ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు పంచాయతీలలో తీసుకోవాల్సిన అంశాలపై పలు సూచనలు చేశారు. విధివిధానాలపై మాస్టర్ ట్రైనర్‌లు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

120 మద్యం సీసాలు స్వాధీనం

మైలవరం: తెలంగాణ రాష్ట్రం ఎర్రుపాలెం నుంచి మైలవరంకు చెందిన ఒక వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న 120 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.సుధాకర్ తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి అతనిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

రెడ్డిగూడెం: కూనపరాజుపర్వలో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సోమవారం దాడి చేసి 5 గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.14,150 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బి.మోహన్‌రావు తెలిపారు.

యువకుడి మృతదేహం లభ్యం

తిరువూరు: పట్టణం శివారులోని కట్టలేరు వాగులో గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని పోలీసులు సోమవారం గుర్తించారు. మద్యం సేవించడం వల్లే ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందిఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహంపై షర్టు లేదు. జీన్‌ప్యాంట్ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. అనంతరం కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆర్డీవోగా బాధ్యతల స్వీకరణ

తిరువూరు, అక్టోబరు 7: తిరువూరు రెవెన్యూ డివిజన్ అధికారిణిగా కె.మాధురి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు సిబ్బంది ఘనస్వాగతం పలికారు. ట్రైనింగ్ నుంచి ఈమె నేరుగా ఆర్డీవోగా బాధ్యతలు చెపట్టారు. గతంలో ఇక్కడి ఆర్డీవోగా బాధ్యతలు నిర్వహించిన మాధవి అమలాపురానికి బదిలీ అయ్యారు.


ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న కె.మాధురి

క్రికెట్ పోటీలకు తపోవన్ విద్యార్థి

జగ్గయ్యపేట: గుంటూరులో 10 నుంచి ఆంధ్రా క్రికెట్ సంఘం ఆ. ధ్వర్యంలో జరిగే అంతర్‌జిల్లాలో అండర్-14 క్రికెట్ పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీలకు జిల్లా జట్టు తరపున జగ్గయ్యపేటలో తపోవన్ విద్యాలయం 8వ తరగతి విద్యార్థి బీవీఎంఎస్ సాయిరాం ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ మండడపు సుధీర్ తెలిపారు. సాయికుమార్‌ను, అతని కోచ్ రాజేంద్రప్రసాద్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు.


సాయిరామ్‌కు బ్యాట్ అందచేస్తున్న ప్రిన్సిపాల్ సుధీర్

ఆరుగురిపై కేసు నమోదు

జగ్గయ్యపేట: ప్రయివేటు ఆసుపత్రిలో సౌకర్యాలు లేవని దుర్భాషలాడుతూ సిబ్బందిపై అనుచితంగా ప్రవర్తించిన ఆరుగురిపై కేసు నమోదు చేసిన సంఘటన జగ్గయ్యపేటలో చోటుచేసుకుంది. ప్రైవేటు ఆసుపత్రిలో సౌకర్యాలు లేవని తమకు రూ.1లక్ష ఇవ్వాలని బ్లాక్ మెయిలింగ్ చేశారని ఆసుపత్రి నిర్వాహకురాలు ఫిర్యాదు చేశారు. పట్టణంలో కోదాడ రోడ్డులో విజయనర్సింగ్ హోం నిర్వాహకురాలు మాలతి ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు చానల్ రిపోర్టర్ పర్వీన్, యూట్యూబ్ చానల్స్ ప్రతినిధులు రమేష్, కిరణ్, వెంకన్నలు ఈ నెల 1, 2, 3 తేదీలలో వరుసగా ఆసుపత్రికి వచ్చి విలేకర్లమని చెప్పి తమ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించారన్నారు. డీఎంహెచ్ఓ చెప్పారని వీడియోలు తీశారు. లక్ష డబ్బులు డిమాండ్ చేశారు. సోషల్ మీడియాలో ఆసుపత్రికి అనుమతులు, సౌకర్యాలు లేవని విష్ణు, జే అర్జున్ అను వార్తలు పోస్టింగ్‌లు పెట్టి తమ ప్రతిష్టకు భంగం కలిగించారు. ఈ మేరకు కొందరు విలేకర్లతో పాటు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్టు జగ్గయ్య పేట ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.


అంబారుపేటలో సత్యమ్మ అమ్మవారు..


జగ్గయ్యపేటలో..


గంపలగూడెంలో..


విస్సన్నపేటలో..

అమ్మ దర్శనం .. సకల శుభకరం

●వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవార్లు ●ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు

నందిగామరూరల్, అక్టోబరు 7:అంబారుపేట గ్రామంలోని సత్యమ్మ అమ్మవారు లలితాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ - శిరీష దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈఏడాది అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈవో హరిగోపీనాద్, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో అమ్మవారికి చండీ సహిత రుద్ర హోమాది క్రతువులు నిర్వహించారు.

నందిగామ: పట్టణంలోని శ్రీరామలింగేశ్వరస్వామివారి ఆలయంలో శుకశ్యామలాంబ దేవికి అన్నపూర్ణాదేవి అలంకారం చేశారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి మహా చండీ అలంకారం చేశారు. మరిడీ మహలక్ష్మి అమ్మవారికి స్వర్ణ కవచ అలంకారం చేశారు. పందిళ్లలో ఏర్పాటు చేసి అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహించారు.

తిరువూరు: శాంతి నగర్‌లోని కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని సోమవారం లలితాత్రిపురసుందరీదేవిగా అలంకరించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు, రంగనాయకస్వామి ఆలయంలో అమ్మవారిని తామర పూలతో అలంకరించారు.

గంపలగూడెం:నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు, మెట్టగుట్ట శేషాచల శ్రీనివాస స్వామి ఆలయంలోని గజలక్ష్మి అమ్మవారు సంతానలక్ష్మిగా దర్శనమిచ్చారు. గంపలగూడెం రామాలయం వీధిలోని కనకదుర్గమ్మ అమ్మవారు మహా చండీ దేవి అమ్మవారుగా, పెనుగొలను రామలింగేశ్వర స్వామి ఆలయంలోని పార్వతి అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు.

జగ్గయ్యపేట: పెద్ద శివాలయంలో పార్వతీ అమ్మవారు ధనలక్ష్మీగా, కన్యక పరమేశ్వరీ అమ్మవారు గాయత్రీ దేవిగా దర్శనమిచ్చారు. దుర్గాపురం దుర్గాదేవి అమ్మవారు అన్నపూర్ణాదేవీగా, ఈశ్వరీ దేవి అమ్మవారు లలితాత్రిపుర సుందరీదేవీగా దర్శనమిచ్చారు. మహాలక్ష్మీ అమ్మ వారి వెండి దేవాలయంలో మహాచండీ అలంకారాన్ని ఏర్పాటుచేశారు. దుర్గాపురంలో చండీహోమం నిర్వహించారు.

విస్సన్నపేట: విస్సన్నపేట కనకదుర్గమ్మ ఆలయం, పుట్రేల మారెమ్మమ ఆలయంలో అమ్మవార్లు సోమవారం చండీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

జగ్గయ్యపేట రూరల్: ముక్త్యాలలోని భవానీ ముక్తేశ్వర స్వామి ఆలయంలో సోమవారం అమ్మవారు భువనేశ్వరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వెలగపూడి లక్ష్మణ ఇందిరాదత్ సౌజన్యంతో నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఈవో సురేష్‌బాబు పర్యవేక్షించారు.

పెనుగంచిప్రోలు : ఐదవ రోజైన సోమవారం అమ్మవారిని చండీ రూపంతోపాటు పలు చోట్ల వేరే రూపాలతో ప్రత్యేకంగా అలంకరణ చేసి పూజలు నిర్వహించారు.

రెడ్డిగూడెం: మండలంలో దేవిశరన్నవరాత్రుల్లో భాగంగా పూజలందుకుంటున్న అమ్మవారు సోమవారం వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కూనపరాజుపర్వ గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయంలో వద్ద అమ్మవారిని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

బతుకమ్మ వేడుకలు

జగ్గయ్యపేట:పట్టణంలో ఈశ్వరీదేవి సమేత పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయం వద్ద విశ్వబ్రాహ్మణ సంఘం, స్వర్ణ కార సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు వైభవంగా జరిగాయి.మహిళలు, కోలాట నృత్యాలు చేస్తూ బతుకమ్మ ఆడారు.


బతుకమ్మలు ఆడుతున్న మహిళలు

కంచికచర్ల: స్థానిక మిక్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం దసరా వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. ముఖ్యంగా విద్యార్థినులు సంప్రదాయ దుస్తులతో కనువిందు చేశారు. రంగు రంగుల పూలతో బతుకమ్మలు ఏర్పాటు చేసి ఆటపాటలతో ఉర్రూతలూగించారు. విద్యార్థులు కోలాటం ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీఈఓ పాండురంగారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వంశీకిరణ్ పాల్గొన్నారు.


మిక్ ఇంజనీరింగ్ కళాశాలలో

ఈకేవైసీకి రెండు రోజులే గడువు

●ఏవో పి.పద్మ

తిరువూరు, అక్టోబరు 7: ఈనెల 9వ తేదీ లోగా రైతులు తమ పంటలను ఈ-క్రాప్ నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలని ఏవో పి.పద్మ తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో రసాయనాలు వినియోగించని, ఆకుకూరలు, కూరగాయల స్టాల్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రసాయణాలు వినియోగించని ఆహారపదార్థాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన జీవనం సాగించవచ్చాన్నారు. అనంతరం ఈ-క్రాప్‌పై రైతులకు పలు సూచనలు చేశారు. ఇప్పటి వరకు మండలంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, 8409 మంది రైతులకు చెందిన పంట ఈ-క్రాప్ నమోదు చేశారు. 7951 మంది రైతులకు ఈకేవైసీ చేయించామన్నారు. నేటికీ ఈకేవైసీ పూర్తి పెండింగ్‌లో ఉన్న రైతులు బయోమెట్రిక్ ద్వారా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. పంటనమోదుతోపాటుగా, ఈకేవైసీ పూర్తిచేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం అందిస్తున్న సున్నావడ్డి పంటరుణం, పంటల బీమా, పంట అమ్ముకునే అవకాశం, వ్యవసాయ పరంగా ప్రభుత్వం అందించే పథకాలకు అందుతాయన్నారు. రైతులు సత్వరం పంటనమోదు, ఈకేవైసీ చేయించుకోవలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


కూరగాయలు అందిస్తున్న ఏవో పద్మ

గోవుల తరలింపు .. మూడు లారీలు సీజ్

గంపలగూడెం: అనధికారికంగా గోవులను తరలిస్తున్న గూడ్స్ లారీలను పోలీసులు సోమవారం సీజ్ చేశారు. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాకు చెందిన రామయత్ మోహన్, రత్నావత్ శంకర్, సురేష్‌లు మూడు గూడ్స్ లారీల్లో 150 గోవులను హనుమాన్ జంక్షన్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. సమాచారంతో పోలీసులు లారీలను పట్టుకొని లారీలను సీజ్ చేశారు. గోవులను అమరావతిలోని అనంతవరం గోశాలకు తరలించారు. నెమలికి చెందిన జోనబోయిన వెంకట కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రైవర్లపై కేసు నమోదు చేసి ద ర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రీను తెలిపారు.

ఆర్డీవోను కలిసిన దేవదత్

తిరువూరు: నూతనంగా ఆర్డీవోగా బాధ్యతలు చెపట్టిన మాధురిని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహ కార్యదర్శి శావల దేవదత్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం తిరువూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీవోను కలిసి ఆయన పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రజలకు అవసరం అయిన సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు.


ఆర్డీవోను కలిసిన దేవదత్

వరద బాధితులకు నిత్యావసరాలు

విజయవాడ రూరల్, అక్టోబరు 7 : వరదల కారణంగా నష్టపోయిన బాధితులకు నష్టపరిహారంతో పాటు రైతులకు పంట నష్టాన్ని కూడా సకాలంలో అందించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందని మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి గ్రామంలో ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కలసి వరద బాధిత కుటుంబాలకు సోమవారం నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ వరద బాధితులను ప్రభుత్వంతో పాటుగా పలు స్వచ్ఛంద సంస్థలు తమ వంతు సహాయం చేసి ఆదుకున్నాయన్నారు. అలాగే వరద బాధితులకు సహాయం అందించడానికి ముందుకు వచ్చిన పల్లె రఘునాథ రెడ్డిని సత్కరించి అభినందనలు తెలిపారు. టీడీపీ నేతలుపున్నారావు, చేబ్రోలు సాయి, ఈడా జయబాబు, పజ్జూరి శేఖర్, జనసేన నాయకులు రామమోహనరావు(గాంధీ)పాల్గొన్నారు.


నిత్యావసర సరుకులు అందిస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్

మద్యం షాపులకు దరఖాస్తుల వెల్లువ

నందిగామ, అక్టోబరు 7: నందిగామ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం షాపులకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం సాయంత్రానికి 120 దరఖాస్తులు అందినట్లు సీఐ బంగారాజు తెలిపారు. సర్కిల్ పరిధిలోని మొత్తం 16 షాపులకు గాను ఇప్పటి వరకూ 120 దరఖాస్తులు అందాయి. ఈనెల 9 సాయంత్రం వరకూ దరఖాస్తు చేసుకొనేందుకు అవకాశం ఉంది. దీంతో దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. రానున్న రెండు రోజుల్లో మరో యాభై దరఖాస్తులు అందవచ్చని అంచనాలు వేస్తున్నారు. మరో వైపు దరఖాస్తు దారులు ఇప్పటికే సిండికేట్ అవుతున్నట్లు తెలియవచ్చింది. ఐదేళ్ల విరామం తరువాత లిక్కర్ వ్యాపారం చేసే అవకాశం రావడంతో వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పాతకాపులు పెద్దయెత్తున దరఖాస్తు చేస్తున్నారు. కొత్తగా వచ్చే వారిని ఇప్పటికే వారి అధీనంలోకి తెచ్చుకుంటున్నారు. మొత్తం మీద లిక్కర్ షాపుల కోసం ఆశావహులు పెద్ద ఆశతో బారులు తీరి దరఖాస్తు చేసుకుంటున్నారు.


బారులు తీరిన దరఖాస్తు దారులు

నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

పెనుగంచిప్రోలు, అక్టోబరు 7 : సమాజంలోని అన్ని వర్గాల పేద ప్రజలకు సేవలందించటంలో ఆర్యవైశ్యులు ముందుండాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పేర్కొన్నారు. స్థానిక పడమర బజార్ కోదండ రామాలయం ప్రాంగణంలో పెనుగంచిప్రోలు మండల ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రయివేట్ కళాశాలల యాజమాన్య సంఘాల ఉపాధ్యక్షుడు వి.దుర్గా ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ సమాజంలోని పేద ఆర్యవైశ్యులతోపాటు మిగిలిన వర్గాలకు చెందిన పేదలకు కూడా సాయం అందించే విషయంలో ఆర్యవైశ్యులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆర్యవైశ్యులంతా కలసికట్టుగా పని చేయాలని సూచించారు. పెనుగంచిప్రోలు మండల ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా మహంకాళి మల్లిఖార్జునరావు, ప్రధాన కార్యదర్శిగా వంగవీటి ఈశ్వరరావు, కోశాధికారిగా స్వామి నారాయణరావు, పీఆర్‌వో వంగవీటి మల్లిఖార్జునరావు, వాసవీ సేవా దళ్ చైర్మన్ దివిలా వంశీకృష్ణతోపాటు పలువురు సభ్యులతో కూడిన నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేశారు. మండల ఆర్యవైశ్య సంఘ మహిళా విభాగం అధ్యక్షురాలుగా మహంకాళి రమ్య, వాసవీ క్లబ్ అధ్యక్షురాలుగా వంగవీటి నాగమణి తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ఎన్టీఆర్ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు బొగ్గవరపు రాజారావు, స్వామి గోపాలరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు మొహం కొప్పు రావూరి రజని, మోటమర్రి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. .


ప్రమాణస్వీకారంలో ఎమ్మెల్యే తాతయ్య

పట్టభద్రుల ఓటుపై అవగాహన

జగ్గయ్యపేట, అక్టోబరు 7: కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అసెంబ్లీ ఎన్నికల తరహాలో సునామి సృష్టించాలని పట్టభద్రులను ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు, పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌లు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో ఉక్కుకళా వేదికలో తాతయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్ల, నియోజకవర్గ ముఖ్యనేతల సమావేశంలో వారు మాట్లాడారు. ఓటరు నమోదు ప్రక్రియ ఈ నెల 30 నుంచి ప్రారంభమైతుందన్నారు. పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేసేందుకు పార్టీ యంత్రాంగం అంతా కృషి చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 100రోజుల స్వల్పకాలంలో ఇచ్చిన హామీలు నేరవేర్చిందన్నారు. పాలనను గాడిలో పెట్టటంతో పాటు, ఉద్యోగులకు జీతాలకు ఇబ్బంది లేకుండా చేయటం, అభివృద్ధి, పరిశ్రమల స్థాపనపై దృష్టి సారించారని చెప్పారు. ఓటరు నమోదుపై దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మేకా వెంకటేశ్వర్లు, మండల పార్టీల అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, కట్టా నరసింహారావు, టి.నాగమల్లేశ్వర రావు, కన్నె బోయిన రామలక్ష్మీ, ఏ.రాణి, జి.నాగరాజు, పి.సైదేశ్వర రావు, వెంకటి, సంగెపు బుజ్జి, మనోహర్, వెంకట్రావు, బీజేపీ నేత కీసర రాంబాబు, జనసేన నేతలు ఈమని కిశోర్, షౌకత్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.


వేదికపై మాట్లాడుతున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

బంగారు ముక్కుపుడక విరాళం

పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ అమ్మవారికి ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరం పడమట వాస్తవ్యులు నందమూరి కళ్యాణ చక్రవర్తి - మాధవి దంపతులు సుమా రు 6 గ్రాముల బంగారపు ముక్కుపుడక విరాళంగా అందజేశారు. ఆలయ ధర్మకర్తలు బెజవాడ శ్రీనివాసరావు, పాలాది వెంకటరమణ, ఏఈవో తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు. వారికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.


విరాళం అందజేస్తున్న దాతలు

గ్రామాలపై అవగాహనా కార్యక్రమం

జగ్గయ్యపేట రూరల్: ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయంలో సామాజిక విజ్ఞాన కళాశాల చివరి ఏడాది విద్యార్థులకు సోమవారం గ్రా మీణ అవగాహన అనుభవ కార్యక్రమాన్ని నిర్వహించారు. బలుసుపా డు, గరికపాడు, తక్కెళ్లపాడు గ్రామాలలో అవగాహన కలిగించారు. తక్కెళ్లపాడు జడ్పీ పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన ఆహారోత్పత్తుల నమూనాలను ప్రదర్శించారు. కెవీకె కోఆర్డినేటర్ కృష్ణంరాజు ప్రజలకు అవగాహన కలిగించారు. సర్పంచ్ శ్రీనివాసరావు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న సర్పంచ్

అధిష్టానమే చూసుకుంటుంది :ఆలపాటి

జగ్గయ్యపేట:కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజక వర్గంలో జనసేన అభ్యర్థి పోటీ చేస్తున్నట్టు జరుగుతున్న ప్రచారం అధిష్టానమే చూసుకుంటుందని కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. మునిసిపల్ కార్యాలయంలో మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ జనసేన అభ్యర్థిగా సామినేని ఉదయ భాను పోటీ చేస్తున్న విషయం తెలియదన్నారు. కూటమి బలపరిచిన అభ్యర్థిగా తాను అన్ని నియో జక వర్గాల ఓటర్ల నమోదుపై అవగాహన కల్పిస్తున్నానని చెప్పారు.